సాక్షి ములుగు

శనివారం । 30 । నవంబర్ । 2024



ఉద్యమ కల సాకారం

నాలుగు దశాబ్దాల కల సాకారం కానుంది. కాజీపేట ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. - 8లో ▸



నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పలు పాఠశాలలు, హాస్టళ్లను తనిఖీ చేశారు. - 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.0° /21.0°

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ములుగు: డిసెంబర్ 2, 3 తేదీల్లో హనుమకొండ ప్రభుత్వ పాఠశాల మైదానం బాక్సింగ్‌లో హాల్‌లో 68వ స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లాకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థినీలు అండర్-19 విభాగంలో లక్ష్మీ ప్రసన్న, అండర్ 17 విభాగంలో అక్షయ (44కేజీలు), కీర్తన, హర్షిత ఎంపికైనట్లు బాక్సింగ్ కోచ్ మామిడిపెల్లి రమేష్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు విద్యార్థినులను ప్రిన్సిపాల్ నర్మదబాయ్, పీడీ త్రివేణి, పీఈటీ శ్రీలతలు అభినందించారు.

గురుకుల పాఠశాల సందర్శన



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను శుక్రవారం ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ వ్యవస్థాపక సభ్యుడు బానోత్ ప్రవీణ్‌నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. పాఠశాలలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను కోరారు.

బూత్ కమిటీ ఎన్నికలను పూర్తి చేయాలి



ములుగు రూరల్: జిల్లాలో బూత్ కమిటీ ఎన్నికలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా సంస్థగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి పెసరు విజయచందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సాధారణ సభ్యత్వాలతో పాటు క్రియాశీల సభ్యత్వాల నమోదును పెంచాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా విజయోత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన మోర్చ ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా అధ్యక్షుడు బలరాం, రవీంద్రాచారి, నరేష్, రవీందర్‌రెడ్డి, కృష్ణాకర్, నాగరాజు, శ్రీనివాస్, జనార్దన్, మల్లేష్, సత్యం, రాజ్‌కుమార్, మహేందర్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

గుట్టలను సందర్శించిన డీఎఫ్‌ఓ

రేగొండ: మండలంలోని పాండవుల, బుగులోని గుట్టలను శుక్రవారం డీఎఫ్‌ఓ నవీన్ రెడ్డి సందర్శించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరుచేసింది. అటవీ శాఖ అధికారుల అనుమతి కోరడంతో అధికారులు శుక్రవారం పరిశీలించారు. అనంతరం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు నరేష్, గౌతమి, శ్రీనివాస్ రెడ్డి, బుగులోని జాతర చైర్మన్ రొంటాల వెంకటస్వామి, నాయకులు నిమ్మల విజేందర్, గంగుల రమణారెడ్డి, కట్ల మధుసూదన్ రెడ్డి, కడారి జనార్దన్ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

భూపాలపల్లి అర్బన్: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్, సప్లమెంటరీ విద్యార్థులు ఆలస్య రుసుం లేకుండా డిసెంబర్ 5వ తేదీలోగా పరీక్షల ఫీజు చెల్లించాలని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ తెలిపారు. రూ. 50 ఆలస్య రుసుంతో డిసెంబరు 12వ తేదీ వరకు, రూ.200 ఆలస్య రుసుంతో డిసెంబర్ 19వ తేదీ వరకు, రూ.500 ఆలస్య రుసుంతో డిసెంబరు 30వ తేదీ వరకు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు. పరీక్షల ఫీజు రూ.125గా నిర్ణయించామన్నారు. ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ పరీక్ష ఫీజుతో పాటు రూ.60 అదనంగా కట్టాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు పట్టణాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.24వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.20వేల లోపు ఉన్నట్లయితే తహసీల్దార్ ఇచ్చిన ఆదాయ ధ్రువపత్రం సమర్పిస్తే పరీక్ష ఫీజు నుంచి మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు.



అర్ధనారీశ్వర అలంకరణలో రామలింగేశ్వరస్వామి

అర్ధనారీశ్వర అలంకరణలో రామలింగేశ్వరస్వామి

వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయంలోని రామలింగేశ్వరస్వామి శుక్రవారం అర్ధనారీశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. కార్తీక మాసం చివరి శుక్రవారం కావడంతో అర్ధనారీశ్వర అలంకరణ చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కోమల్లపల్లి హరీష్‌శర్మ తెలిపారు. అలాగే రామప్ప ఆలయాన్ని ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సందర్శించి రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయగా, ఆలయ విశిష్టత గురించి గైడ్ గోరంట్ల విజయ్‌కుమార్ వివరించారు.



అయ్యప్ప పడి పూజ నిర్వహిస్తున్న గురు స్వాములు

స్వామియే శరణం అయ్యప్ప..

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం గురు స్వాములు కొండపర్తి రాంబాబు, చిడెం రమేష్, కొండపర్తి శివకృష్ణ, సాధు లక్ష్మణ్ గురుస్వాముల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, కలశపూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వాములు అయ్యప్ప భజన పాటలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అనంతరం అయ్యప్ప పద్దెనిమిది మెట్లకు పూజా కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప స్వాములకు, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మినీ జాతరకు పూర్తయ్యేనా?

- నిలిచిన పూజారుల భవన నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో సమ్మక్క-సారలమ్మ పూజారుల విశ్రాంతి భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మేడారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్లు నిధులు కేటాయించారు. మొదట్లో భవన నిర్మాణ పనులు వేగంగా చేపట్టిన కాంట్రాక్టర్ చివరి దశలో పనులు నిలిపేశారు. పూజారులు విశ్రాంతి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసువాల్సిన అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పనుల విషయంలో సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతోనే ఇందుకు కారణమని పలువురు వాపోతున్నారు.

ఫిబ్రవరిలో మినీ జాతర..

వచ్చే ఏడాది ఫిబ్రవరిలో 12 నుంచి 15 తేదీ వరకు మినీ మేడారం జాతర జరగనుంది. ఈ జాతరకు సమ్మక్క- సారలమ్మ పూజారులతోపాటు పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, ఏటూరునాగారం మండలంలోని కొండాయి నుంచి గోవిందరాజు పూజారులు మినీ జాతరకు హాజరవుతారు. మినీ జాతర నాటికి భవన నిర్మాణ పనులు పూర్తయితే పూజారులకు చాలా వినియోగపడనుంది. కానీ జాతర వరకు పనులు పూర్తయ్యేలా లేవు. భవన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతాయోనని పూజారులు ఎదురుచూస్తున్నారు. భవన నిర్మాణ పనులు త్వరగా నాణ్యతగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని పూజారులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ ఇష్టారీతిన పనులు చేస్తున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారని అంటున్నారు. మినీ మేడారం జాతర వరకు విశ్రాంతి భవన నిర్మాణం పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పూజారులు కోరుతున్నారు. భవన నిర్మాణ పనుల్లో అదనంగా నిధులు పెంచడంతో దేవాదాయశాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాకపోవడంతోనే పనులు నిలిచినట్లు తెలుస్తుంది. పూజారుల భవన నిర్మాణ పనుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మినీ జాతరలో భక్తులకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏ మేరకు సౌకర్యాలు కల్పిస్తారో చూడాల్సి ఉంది.



నిలిచిన పూజారుల భవన నిర్మాణ పనులు

త్వరగా పూర్తి చేయిస్తాం...

మినీ మేడారం జాతర నాటికి పూజారుల భవన నిర్మాణ పనులు పూర్తి చేయిస్తాం. భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. మినీ జాతర వరకు పూజారులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

- రాజేంద్రం, మేడారం ఈఓ

కేసీఆర్ నిర్ణయంతోనే తెలంగాణ

- ప్రాణాలను లెక్కచేయని నేత మాజీ సీఎం
- దీక్షా దివస్‌లో జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ సుధీర్‌కుమార్

ములుగు: తెలంగాణ రాష్ట్రం వచ్చుడా..కేసీఆర్ సచ్చుడా.. అంటూ రాష్ట్ర మలిదశ ఉద్యమంలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతోనే నేడు స్వరాష్ట్రం సిద్ధించిందని హనుమకొండ మాజీ జెడ్పీ చైర్మన్, దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. ఈ మేరకు తెలంగాణ ఉద్యమంలో ఆమరణ నిరాహారదీక్షను చేపట్టిన రోజును పురస్కరించుకొని తెలంగాణ సాధన ఉద్యమ తీపిగుర్తులను యాది చేసుకోవడానికి దీక్షా దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లాకేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలంగాణ తల్లి, మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తెలంగాణ ఉద్యమంలోని వార్తాకథనాలు, నాయకుల ఫొటోలతో కూడిన గ్యాలరీని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా సుధీర్‌కుమార్ హాజరై మాట్లాడారు. కేసీఆర్ పోరాట ఫలితంగానే తెలంగాణ స్వరాష్ట్ర కలను సాకారం చేసుకున్నామన్నారు.

బీఆర్‌ఎస్ జెండాలను తొలగించారు

దీక్షా దివస్ సందర్భంగా జిల్లాకేంద్రంలోని జాతీయ రహదారి డివైడర్లకు ఇరువైపులా కార్యకర్తలు ఏర్పాటు చేసిన పార్టీ జెండాలను స్థానిక మంత్రి తొలగించేయించారని మాజీ జెడ్పీచైర్‌పర్సన్, ములుగు నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. హుందాగా నడుచుకోవాల్సిన మంత్రి ఈ విధంగా చర్యలకు పాల్పడడం బాధాకరమన్నారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఉద్యమ నాయకుల పోరాటం గొప్పదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, సీనియర్ నాయకులు మద్రగాని వినయ్‌కుమార్, భూక్య జంపన్ననాయక్, పోరిక విజయ్‌రాంనాయక్, గొర్రె సమ్మయ్య, కోగిల మహేష్, నూనావత్ మహేష్‌నాయక్, సురేందర్, ఆయా మండలాల అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లక్ష్మణ్‌రావు, బడే నాగజ్యోతి తదితరులు

మహా దీపోత్సవం

కాళేశ్వరం: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని కాళేశ్వరం దేవస్థానంలో మహాదీపోత్సవాన్ని ఆలయ అధికారులు వైభవోపేతంగా నిర్వహించారు. శుక్రవారం 11,116 దీపాలను మహిళలు వెలిగించారు. అంతకుముందు ఆకాశదీపాన్ని వెలిగించి ప్రత్యేక పూజకార్యక్రమాలను నిర్వహించారు.



కుష్ఠువ్యాధి నిర్మూలనే లక్ష్యం

- డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్‌రావు

ములుగు: కుష్ఠువ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్‌రావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలోని వైద్యశాఖ సమావేశమందిరంలో సిబ్బందికి ఇచ్చిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీల వారీగా నిర్దిష్టమైన సూక్ష్మ ప్రణాళికలను తయారుచేసుకొని అందుకు అనుగుణంగా కార్యచరణ కొనసాగించాలన్నారు. ముఖ్యంగా ఆశకార్యకర్తలు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. నూతనంగా వ్యాధి సోకిన వారిని గుర్తించి వారికి సకాలంలో మందులు అందించాలన్నారు. డిసెంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు గ్రామాల వారీగా టీంలను ఏర్పాటు చేసుకొని రోజుకు 20 ఇళ్ల చొప్పున సర్వే చేయాలని కుష్టు, టీబీ, కీటక జనిత నియంత్రణ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ భవ్యశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రణధీర్, డాక్టర్ పవన్‌కుమార్, డెమో సంపత్, డీపీఎంఓ సాంబయ్య, సంజీవరావు, సత్యనారాయణ, ఏఎంఓ దుర్గారావు, కమ్యూనిటీ హెల్త్ అధికారి పూర్ణసంపత్‌రావు, వెంకట్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, సాంబయ్య, సురేష్ బాబు, వెద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ గోపాల్‌రావు

నాణ్యమైన సరుకులు వినియోగించాలి

- రాష్ట్ర జీసీసీ జనరల్ మేనేజర్ సీతారాం

ములుగు రూరల్: ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో నాణ్యమైన సరుకులను మాత్రమే వినియోగించాలని తెలంగాణ రాష్ట్ర జీసీసీ జనరల్ మేనేజర్ సీతారాం సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని జగ్గన్నపేట బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీసీసీ నుంచి ఆశ్రమ పాఠశాలలకు పంపిణీ చేసే నిత్యావసర సరుకులను వార్డెన్‌లు తప్పనిసరిగా పరిశీలించి నాణ్యత ఆధారంగా తీసుకోవాలని అన్నారు. ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా సరుకులను తీసుకోవాలన్నారు. అనంతరం వంట కార్మికులు, విద్యార్థులను సరుకుల నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, జీసీసీ ములుగు మేనేజర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న సీతారాం

సాగు భూములకు త్రీఫేజ్ కరెంట్ అందించాలి

ఏటూరునాగారం: ఆదివాసీ సాగు భూములకు పంట బోర్లు, త్రీఫేజ్ కరెంటు సౌకర్యం కల్పించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ కోరారు. శుక్రవారం ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చిత్రమిశ్రాకు వినతి పత్రం అందించారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ వెంకటాపురం(కె) మండలం అలుబాక గ్రామ పంచాయతీ పరిధిలోని ముత్తారం, చిన్నగంగారం, మరిక్యాల, లక్ష్మీపురం, తిప్పాపురం గ్రామాల పరిధిలోని ఆదివాసీలకు చెందిన సాగు భూములకు నీటి సౌకర్యం లేక చేతికి వచ్చిన పంటలు ఎండిపోయి రైతులకు అందకుండా పోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. వెంటనే పంటలకు బోర్లు, త్రీఫేజ్ కరెంటు అందించాలన్నారు. లేదంటే దశలవారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మండల అధ్యక్షుడు తుర్స కృష్ణబాబు, ఉపాధ్యక్షులు తాటి రాంబాబు, కుర్సం ముత్తయ్య, మిడియం అర్జున్, కుంజ చందు, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజల ఆకాంక్ష మేరకు ప్రజాపాలన

- వచ్చే నాలుగేళ్లలో మరింత గొప్ప పాలన
- మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క
- జిల్లా కేంద్రంలో ఘనంగా ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ

ములుగు: ప్రజల ఆకాంక్ష మేరకు ప్రజాపాలన అందిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు ప్రజాపాలన విజయోత్సవ సంబురాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి డ్వాక్రా మహిళలు, వైద్యశాఖ అధికారులు, ఉద్యోగులు, ప్రజలతో కలిసి డీఎల్ఆర్ ఫంక్షన్‌హాల్ వరకు విజయోత్సవ ర్యాలీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పాలన కొనసాగుతుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో అనేకమంది అమరులయ్యారని, ఉద్యమాన్ని తన పాటల ద్వారా గ్రామగ్రామాన లేవనెత్తిన గొప్పవ్యక్తి గద్దర్ అని అన్నారు. ఎన్నికల ముందు మేడారం సమ్మక్క-సారలమ్మ సన్నిధి నుంచి మొదలుపెట్టిన పాదయాత్ర సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతున్నామన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి కావాల్సిన పనుల కోసం కృషి చేస్తున్నానన్నారు. ములుగును మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డికి నివేదికను సమర్పించామన్నారు. అంతడుపుల నాగరాజు కళాబృందం తరపున నిర్వహించిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టీఎస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, ఆర్డీఓ వెంకటేష్, డీపీఆర్వో రఫీక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నెరవేర్చాం..

ములుగు రూరల్: ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా మల్లంపల్లి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మండలంగా ప్రకటించామని మంత్రి డాక్టర్ దనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి సీతక్కకు మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు ఆధ్వర్యంలో ప్రజలు ఘనస్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ల్యాద శ్యాంరావు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో మంత్రి ధనసరి సీతక్క, కలెక్టర్ దివాకర, తదితరులు



నృత్యం చేస్తున్న కళాకారులు

భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ప్రభుత్వ అవసరాల కోసం సేకరిస్తున్న భూములకు తగిన పరిహారాన్ని అందిస్తామని భూపాలపల్లి ఆర్డీఓ మంగీలాల్ తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 130 హెక్టార్ల వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి నిర్మాణానికి భూసేకరణ చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లాలో 25 కిలోమీటర్ల పొడవు వరకు ఈ రహదారి నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. భూసేకరణ చట్టం ప్రకారం మెరుగైన నష్టపరిహారం అందించనున్నట్లు తెలిపారు. కొంతమంది దళారులు చెప్పే మాటలు నమ్మకుండా రైతులు నేరుగా ఆర్డీఓ కార్యాలయానికి వచ్చి నష్టపరిహారం విషయంలో పూర్తిగా సమాచారం తెలుసుకోవాలన్నారు. భూసేకరణ పనులకు రైతులు సహకరించాలని కోరారు.

భయాందోళనకు గురిచేయడం సరికాదు

- మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్

మంగపేట: మధ్యాహ్న భోజన కార్మికులను భయాందోళనకు గురి చేయడం సరికాదని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యాశాఖ అధికారులు ఒత్తిడి చేస్తూ వంట కార్మికులను భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. కొన్ని ప్రాంతాల్లో హెచ్‌ఎంలు వారికి నచ్చిన వారిని కార్మికులుగా నియమించేందుకు కుట్రపూరితంగా నిర్వాహకులపై నేరాలను మోపుతూ తొలిగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం ప్రధాన అంశం అయినప్పటికీ దానికి మార్కెట్‌లో ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు ఇవ్వడం, ప్రతీ నెల పెండింగ్ లేకుండా బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం జిల్లా కార్యదర్శి పర్వీనా, మండల అధ్యక్ష కార్యదర్శులు రాజకుమారి, భారతి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రవీందర్, తదితరులు

క్లుప్తంగా

నేటి నుంచి జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్, వరంగల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నేటి నుంచి జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, మనోహర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్ గౌడ్ స్మారకార్థం నిర్వహించే టోర్నమెంట్ ఈ నెల 30 నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు ఓపెన్ మెన్స్ కేటగిరీలో జరగనున్నట్లు వెల్లడించారు. సుబేదారిలోని వరంగల్ క్లబ్ వేదికగా జరిగే టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.2.5 లక్షల నగదు పురస్కారంతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే పోటీలకు నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, కలెక్టర్ ప్రావీణ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దహనం

- రూ.2లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన ఇంటి ఎదుట బాధితులు

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని నమిలిగొండలో ప్రమాదవశాత్తు బోనగిరి సాంబరాజుకు చెందిన ఇల్లు, ఇంటిలో వస్తువులు దహనమై రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన శుక్రవారం జరిగింది. బాధితులు సాంబరాజు, అపర్ణ దంపతులు తెలిపిన వివరాలు ప్రకారం.. నమిలిగొండ గ్రామానికి చెందిన సాంబరాజు హమాలీ పని చేస్తుండగా అతని భార్య వ్యవసాయ కూలీగా కుటుంబాన్ని పోషిస్తున్నారు. రోజూ మాదిరిగానే శుక్రవారం వారు పనులకు, పిల్లలు పాఠశాలకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇంట్లోని టీవీ, మంచాలు తదితర ఫర్నీచర్, దుస్తులు, బియ్యం బస్తాలు, రూ.30వేలు నగదు కాలిబూడిదయ్యాయి. ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన చుట్టుపక్కల వారు సాంబరాజుకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో మంటలను అదుపుచేశారు. కానీ, అప్పటికే వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు, సామగ్రి కాలిపోవడంతో మాజీ ఎంపీటీసీ సభ్యుడు పురమాని రజాక్‌యాదవ్, కాంగ్రెస్ నాయకుడు కుందూరు అశోక్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబానికి రూ.5వేలు అందించారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సాయం అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కాజీపేట మండలం అయోధ్యపురంలో కొనసాగుతున్న రైల్వే వ్యాగన్ షెడ్ నిర్మాణాలు





ఉద్యమ కల సాకారం

కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం 45ఏళ్లు సాగిన పోరాటం

- 1977–1978లో ఆజంజాహి మిల్లులో కార్మికుల తొలగింపుతో తెరపైకి కోచ్ ఫ్యాక్టరీ నినాదం
- 1979లో కమ్యూనిస్టులు భగవాన్ దాస్, కాళిదాస్ ఆధ్వర్యంలో ఉద్యమం
- తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర విభజన చట్టంలో కీలక అంశంగా కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన
- కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ కోసం 13 ఏళ్లు పోరాడిన రైల్వే జేఏసీ
- పీపుల్స్‌వార్, మావోయిస్టుల మద్దతు



నెరవేరనున్న కల

పదమూడున్నరేళ్ల రైల్వే జేఏసీ ఉద్యమంతో కాజీపేటకు రైల్వే వ్యాగన్ పీఓహెచ్ షెడ్, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, నేడు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు బాటలు పడ్డాయి. దీంతో నాలుగు దశాబ్దాల కల సాకారం కానుందని ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాజీపేట రూరల్: ఉమ్మడి జిల్లా ప్రజల ఉపాధికి పెద్దదిక్కుగా ఉన్న నాటి ఆజంజాహి మిల్లులో కార్మికుల సంఖ్యను మెల్లమెల్లగా తగ్గిస్తున్న నేపథ్యంలో.. నాటి కామ్రేడ్లు భగవాన్ దాస్, కాళిదాస్ ఉమ్మడి జిల్లాలో ప్రత్యామ్నాయ ఉపాధి కోసం కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని తెరపైకి తీసుకొచ్చారు. ఊరూరా ఉద్యమించి గల్లీ నుంచి ఢిల్లీ వరకు కోచ్ ఫ్యాక్టరీ నినాదాన్ని తీసుకెళ్లి సక్సెస్ అయ్యారు. వారి పోరాట స్ఫూర్తితో రాజకీయ పార్టీలు, సంఘాలకు అతీతంగా కాజీపేట, వ్యాగన్ షెడ్, కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్ కోసం కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ నాయకులు 13 ఏళ్లపాటు సుదీర్ఘ పోరాటం చేశారు. ఈనేపథ్యంలో రైల్వే వ్యాగస్, కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్‌పై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఆజంజాహి కార్మికుల తొలగింపు.. కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం..

జిల్లాలోని ఆజంజాహి మిల్లులో 1977–78లో కార్మికుల తొలగింపు ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తే జిల్లాలో కొంత వరకు నిరుద్యోగ సమస్య తీరుతుందని గ్రహించిన నాటి కామ్రేడ్లు భగవాన్‌దాస్, కాళిదాస్ 1978లో ఉద్యమం చేపట్టారు. ఊరూరా సైకిల్ యాత్రలు చేపట్టి ప్రజలను చైతన్యవంతం చేశారు. బ్రిటీష్, నిజాం సర్కార్ కాలంలో ఇల్లందులో బొగ్గుగనుల కేంద్రం నుంచి బొగ్గు గనులు తీసి, ట్రెన్ కోచ్ షీట్స్ హీట్ చేసేవారు. ఇల్లందులో కోల్ మైనింగ్ కేంద్రం ఉంది.. కావున కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలనే ఉద్యమం ఎగిసింది. కాజీపేట– మద్రాస్ వరకు అప్పట్లో సింగిల్‌లైన్ ఉంది. జిల్లాలో కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమిస్తున్న సమయంలోనే మద్రాస్‌లో వ్యాగన్ వర్క్ షాప్ నెలకొల్పారు. తర్వాత కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారు. ఇది కూడా జిల్లా నుంచి మద్రాస్‌కు కోచ్ ఫ్యాక్టరీ తరలిపోయిందని చెప్పవచ్చును. ఈక్రమంలో 1982లో కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం తీవ్రంగా సాగింది. అదే సమయంలో జిల్లాకు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కూడా మంజూరు అయి తెరమరుగైంది.

వ్యాగన్‌షెడ్ నిర్మాణం

అయోధ్యపురం వద్ద 160 ఎకరాల్లో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ గత సంవత్సరం శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు 65 శాతం పనులు పూర్తికాగా.. 2025 ఆగస్టులో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు.

2009లో వ్యాగన్ షెడ్ మంజూరు

కాజీపేట రైల్వే డివిజన్, కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమ నేపథ్యంలో 2009లో నాటి రైల్వే మంత్రి మమతా బెనర్జీ హయాంలో కాజీపేటకు రైల్వే వ్యాగన్ షెడ్ మంజూరైంది. తర్వాత కాజీపేటలో ఎలక్ట్రిక్ షెడ్ నిర్మాణం జరిగింది. 2011లో తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు నేతృత్వంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్ ప్రస్తావన బలంగా ముందుకు సాగింది. తర్వాత్తర్వాత రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ ప్రస్తావన రాజకీయ అంశంగా మారి తెలంగాణ ఉద్యమంలో ప్రధాన డిమాండ్లుగా నిలిచాయి.

1983లో కమిటీ ఏర్పాటు

ప్రధానిగా ఇందిరాగాంధీ ఉన్న సమయంలో కెబినెట్‌లో తెలంగాణ నుంచి మానవవనరుల శాఖ మంత్రిగా పీవీ నర్సింహారావు కొనసాగారు. ఆసమయంలో భగవాన్‌దాస్, కాళిదాస్‌ల పోరాటంతో 1983లో జిల్లాలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని ఇందిరాగాంధీ కమిటీ వేసింది. భూసేకరణ కూడా జరిగింది. అదే ఏడాది (1983)లో ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల్లో జిల్లా నుంచి పీవీ నర్సింహారావు ఓటమి చెందారు. బీజేపీ, టీడీపీ అలయన్స్‌తో కోచ్ ఫ్యాక్టరీ నినాదంతో జంగారెడ్డి ఎంపీ అయ్యారు. హనుమకొండ నుంచి ఓటమి చెందిన పీవీ.. నాగపూర్ రాంటెక్ నుంచి విజయం సాధించారు.

ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీకి గ్రీన్ సిగ్నల్

కాజీపేటలో వ్యాగన్ షెడ్ నిర్మాణ పనులు కొనసాగుతుండగా కేంద్రం కాజీపేటకు ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆర్‌వీఎన్ఎల్ సంస్థ కాజీపేట వ్యాగన్‌షెడ్‌లో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే కోచ్ ఫ్యాక్టరీకి రూ.580 కోట్లు, మరో దఫా రూ.66 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు సైతం రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాజీపేట రైల్వే డివిజన్‌కు కావాల్సిన సరిహద్దులు ఏర్పాటు చేయాలని రైల్వే జీఎంకు ఆదేశాలు జారీ చేసింది. కాజీపేట వ్యాగన్, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అయితే ప్రత్యక్షంగా.. పరోక్షంగా సుమారు 10 వేల మందికి ఉపాధి లభించనుంది

స్థానికులకు ఉపాధి కల్పించాలి



"పంజాబ్‌లోని కపుర్తాల కోచ్‌ఫ్యాక్టరీలో ఉద్యోగాలు భర్తీ చేసిన విధంగానే కాజీపేట రైల్వే వ్యాగన్‌షెడ్, కోచ్‌ఫ్యాక్టరీలో స్థానిక నిరుద్యోగులకు అవకాశం కల్పించాలి. లేదంటే ఉద్యమిస్తాం. కేంద్ర ప్రభుత్వం రెండు రైల్వే పరిశ్రమలను నెలకొల్పుతున్నందుకు, స్థలం ఇచ్చిన ఆనాటి రాష్ట్ర ప్రభుత్వానికి రైల్వే జేఏసీ తరఫున కృతజ్ఞతలు.

– దేవులపల్లి రాఘవేందర్, రైల్వే జేఏసీ కన్వీనర్

ప్రజా ఉద్యమాలదే విజయం



జిల్లాలో 45 ఏళ్ల ప్రజా ఉద్యమ చరిత్ర గల రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే డివిజన్ మంజూరుకు ఆనాడు చేస్తున్న అనేక ఉద్యమాలకు పీపుల్స్‌వార్ సైతం మద్దతు ప్రకటించారు. రైల్వే జేఏసీ రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, రైల్వే వ్యాగన్ షెడ్, కాజీపేట డివిజన్ ఏర్పాటు కోసం చేస్తున్న ఉద్యమాలకు మావోస్టు పార్టీ కూడా మద్దతు పలుకుతున్నట్లు ప్రకటించడం జరిగింది. ప్రజా ఉద్యమాలు ఎప్పటికైనా విజయం సాధిస్తాయి.

– కొండ్ర నర్సింగరావు, రైల్వే జేఏసీ చైర్మన్

ఇన్‌స్టాగ్రామ్ పరిచయమే ప్రాణం తీసింది..

- మహిళ వద్ద అప్పు తీసుకున్న యువకుడు
- ఫోన్ సంభాషణలతో అనుమానం పెంచుకున్న మహిళ భర్త
- ప్లాన్ ప్రకారం యువకుడి హత్య
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ, ఎస్సైలు

కాళేశ్వరం: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన మహిళ వడ్డీలకు అప్పులు ఇస్తుందని తెలుసుకున్న ఓ యువకుడు ఆమె సోదరుడి ద్వారా రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. ఈక్రమంలో మహిళతో తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. దీంతో ఆమె భర్తకు అనుమానం పెరిగి అపార్థం చేసుకొని యువకుడిని హత్య చేశాడు. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం చంద్రుపల్లిలో గత బుధవారం జరిగిన ఈ హత్యకు సంబంధించి శుక్రవారం రాత్రి కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామానికి చెందిన ముత్యాల శ్రీకాంత్ గౌడ్(24) పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం చందనాపూర్ గ్రామానికి చెందిన వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు పొన్నం శివకృష్ణగౌడ్ భార్యతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకున్నాడు. ఆ మహిళ సోదరుడు పవన్, శ్రీకాంత్‌గౌడ్ ఇద్దరూ స్నేహితులు కావడంతో ఆమె వద్ద రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. ఆ అప్పు విషయంలో వారిద్దరు తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. గమనించిన ఆమె భర్త పలుమార్లు మహిళను మందలించాడు. ఫోన్‌లో మాట్లాడడంతోపాటు, వారిద్దరు దగ్గరయ్యారనే అనుమానంతో శివకృష్ణ, అతని స్నేహితుడు ఎండీ ఫయాజ్‌తో కలిసి శ్రీకాంత్‌ను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో కొమ్మెర గ్రామానికి చెందిన కిరాణ దుకాణం నిర్వాహకుడు కురుమ సాయితో పరిచయం పెంచుకుని శ్రీకాంత్ కదలికలను తెలుసుకున్నాడు. ఈ నెల 27వ తేదీన (బుధవారం) గ్రామంలో రెక్కీ నిర్వహించగా అక్కడ లేడని, అన్నారం సమీపంలోని చంద్రుపల్లిలో హార్వెస్టర్ నడిపిస్తున్నట్లు సాయి తెలిపాడు. దీంతో శివకృష్ణ, అతని స్నేహితుడు ఫయాజ్.. సాయి దుకాణంలో బీర్లు, ఆ తర్వాత కల్లు తాగి మహదేవపూర్ మండలం చంద్రుపల్లికి వచ్చారు. అక్కడ హార్వెస్టర్ డ్రైవర్ కోసం తన కారులో వేచి చూస్తున్న శ్రీకాంత్‌తో గొడవపడ్డారు. వెంటతెచ్చుకున్న కత్తితో చాతి, కడుపులో విచక్షణారహితంగా పొడవగా శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందడంతో బైక్ వదిలేసి పారిపోయారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. హత్యచేసిన రోజు ధరించిన రక్తపుదుస్తులు, కత్తి, హెల్మెట్ దాచి ఉంచిన స్థలానికి శుక్రవారం నిందితులు చేరుకోగా చంద్రుపల్లి వద్ద మహదేవపూర్ సీఐ రామచంద్రరావు, ఎస్సైలు చక్రపాణి, పవన్‌కుమార్, తమాషారెడ్డిలతోపాటు పోలీసులు పట్టుకున్నారు. వారినుంచి పల్సర్ బైక్, కత్తి, రక్తపు మరకలతో ఉన్న దుస్తులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పేదింటికి పెద్ద జబ్బు

- రెండు కిడ్నీలు పోయి.. మంచంపట్టి..
- డయాలసిస్‌తో నెట్టుకొస్తున్న యువకుడు
- కిడ్నీ ఇచ్చేందుకు సమ్మతించిన తండ్రి
- ఆర్థిక స్థోమత లేక ఆపరేషన్‌కు దూరం

దీన గాథ



ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న ఉపేందర్

కురవి: భార్య, ఇద్దరు పిల్లలతో హాయిగా జీవిస్తున్న ఓ పేదింటి యువకుడు రెండు కిడ్నీలు చెడిపోయి మంచం పట్టాడు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన ఇటికాల వెంకటయ్య–ఉప్పలమ్మల పెద్ద కుమారుడు ఉపేందర్ మానుకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. అదే ఆస్పత్రిలో భార్య పార్వతి ఏఎన్ఎంగా పనిచేస్తోంది. వీరికి అర్షిత 8వ తరగతి, నందిత 3వ తరగతి ఉన్నారు. ఉపేందర్‌కు 8 నెలల క్రితం ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆస్పత్రిలో చెక్ చేయించుకున్నాడు. కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు నిర్ధారించారు. దీంతో హైదరాబాద్‌లో మరోమారు పరీక్ష చేయించాడు. అక్కడ కూడా అదే విషయాన్ని చెప్పిన వైద్యులు డయాలసిస్ చేయాల్సి ఉంటుందని సూచించారు. ఈనేపథ్యంలో 8 నెలల నుంచి వారానికి రెండు సార్లు మానుకోటలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. నిత్యం ఆస్పత్రికి వెళ్లడం.. అనారోగ్యంపాలు కావడంతో భార్యభర్తలు ఆస్పత్రిలో ఉద్యోగం మానేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. ఈక్రమంలో ఆపరేషన్ చేస్తే ఒక్క కిడ్నీతో బతకవచ్చని డాక్టర్లు చెప్పారు. కానీ, కుటుంబాన్ని పోషించడమే భారంగా మారిన ఉపేందర్‌కు ఆపరేషన్ చేయించుకునే స్థోమత లేకపోవడంతో దుఃఖసాగరంలో మునిగిపోయాడు.

ఆపరేషన్‌కు రూ.8 లక్షలు..

రెండు కిడ్నీలు చెడిపోయి మంచంపట్టిన కుమారుడిని పరిస్థితిని చూసిన తండ్రి వెంకటయ్య కిడ్నీ ఇచ్చేందుకు ముందుకొచ్చాడు. కానీ, కిడ్నీ మార్పిడికి రూ.8 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. ఆపరేషన్ ఆరోగ్యశ్రీలో చేసే అవకాశం ఉన్నప్పటికీ ఇద్దరిలో ఒకరికే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని వైద్యులు చెప్పడంతో ఆర్థికస్థోమత లేని ఉపేందర్ ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. దాతలు ఆదుకోవాలని ఉపేందర్‌తోపాటు అతని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

దాతలు 97046 10919 ఫోన్ పే నంబర్‌కు తోచిన సాయం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ కారణాలతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



రవి(ఫైల్)

విద్యుదాఘాతంతో వ్యక్తి..

భూపాలపల్లి రూరల్: అడవిపందుల కోసం వేసిన విద్యుత్ తీగలకు తగిలి రైతు మృతి చెందాడు. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నేరేడుపల్లి గ్రామ శివారులమేకల రవి(36) అనే రైతు శుక్రవారం మధ్యాహ్నం తన వ్యవసాయ భూమి వద్దకు బయలుదేరాడు. ఆదేగ్రామానికి చెందిన వెంబడి సమ్మయ్య, ఎంబడి శీనులు అడవి పందుల కోసం పెట్టిన కరెంటు వైర్‌లను నిర్లక్ష్యంగా వదిలేశారు. రవి ఆ తీగలకు తగిలి చనిపోయాడు. ఈ మేరకు మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు సీఐ నరేష్ తెలిపారు.మృతుడికి ఇద్దరు పిల్లలు, తల్లి ఉన్నారు.

గడ్డిగూడెం తండాలో..



వీరన్న (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మహబూబాబాద్ మండలంలోని గడ్డిగూడెం తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ మండలంలోని గడ్డిగుడెం తండా గ్రామానికి చెందిన ధరావత్ వీరన్న (45) పొలం పనులకు వెళ్లివచ్చి స్నానం కోసమని నీళ్లు హీటర్తో వేడి చేసుకున్నాడు. ఈక్రమంలో బకెట్ నుంచి హీటర్ తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై శరీరంపై తీవ్ర గాయాలై పడిపోయాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు వచ్చి చూసేలోగా వీరన్న మృతిచెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా బ్లూకోల్ట్స్ పీసీలు విజయ్, సంపత్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ వెంకటేశ్, సిబ్బంది సాగర్ ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడి భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లొస్తూ..



రమేశ్(ఫైల్)

టేకుమట్ల: అంత్యక్రియలకు వెళ్లొస్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని బండపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండల కేంద్రానికి చెందిన తాటికంటి రాజయ్య మృతి చెందగా ఆయన అంత్యక్రియలకు.. మొగుళ్లపల్లి మండలంలోని నర్సింగాపూర్‌కి చెందిన శనిగరపు రమేశ్(45) హాజరై, టేకుమట్ల మండలంలోని కుందనపల్లికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో బండపల్లి శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బురదలో పడిపోయాడు. దీంతో ఊపిరాడక మృతి చెందాడు. కాగా, బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్న రమేశ్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చి తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

- అనాథలైన పిల్లలు
- గూడ్స్ వాహనం డ్రైవర్ అజాగ్రత్తతో ప్రమాదం



సుభాన్(ఫైల్)



సబ్రిన్(ఫైల్)





తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన చిన్నారులు నవాజ్, సోని

గీసుకొండ: సాఫీగా సాగుతున్న కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం రూపంలో వచ్చిన మృత్యువు చిన్నాభిన్నం చేసింది.. ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కోటగండి సమీపంలో పీడీఆర్ ఫంక్షన్ హాల్ ఎదుట వరంగల్–నర్సంపేట రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి, మృతుల బంధువులు, గీసుకొండ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ నగరంలోని కరీమాబాద్ ఉర్సు దర్గాకు చెందిన ఎండీ సుభాన్(35), సబ్రిన్ (29) అనే దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భార్యాభర్తలు ఉదయం తమ కొత్త సీఎన్జీ ఆటోలో పిల్లలు సుమాయ, సోని, నవాజ్‌లను ఎక్కించుకుని నగరంలోని స్కూల్‌లో వదిలిపెట్టారు. అనంతరం గీసుకొండ మండలంలోని వరంగల్–నర్సంపేట రహదారిలో ధర్మారం తండా సమీపంలో సీఎన్జీ బంక్‌లో గ్యాస్ నింపుకుని ఉదయం 11.10 గంటల సమయంలో తిరిగి వరంగల్ నగరానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో పీడీఆర్ గార్డెన్స్ వద్ద వరంగల్ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న సరుకుల రవాణా ట్రక్కు డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వారి ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సబ్రిన్ అక్కడే మృతి చెందగా, సుభాన్‌ను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. సుభాన్ మామ ఎండీ సోఫీ ఫిర్యాదు మేరకు ట్రక్ డ్రైవర్ గడ్డం జస్వంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రానికి చెందిన బీటెక్ విద్యార్థి చాపర్తి ముక్తానంద్(19) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గీసుకొండ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ముక్తానంద్ కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు, రక్త కణాలు తగ్గిపోవడంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెంది మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు చేసుకున్నాడు. మృతుడి తండ్రి చాపర్తి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.